# ప్రమదావనం

## మాలతీ చందూర్

నా పేరున ఒక ఉత్తరం కూడా రావడం లేదు అన్న వెలితితో ఒక్క ఉత్తరమైనా వస్తే బాగుండును అని ఎదురు చూసే వ్యక్తికి అయిదేళ్ళు తిరక్కుండా వారానికి అయిదు వందల ఉత్తరాల దాకా వచ్చేవి అంటే అది అపూర్వమైన అవకాశం అని అందరూ ఒప్పుకుంటారు. ఇటువంటి అపురూపమైన అదృష్టం అనండి, అవకాశం అనండి, శ్రమకు ఫలితం అనండి, పాపులారిటీ అనండి, ఏ పేరుతో పిలిచినా సరే ఇప్పటికి ముప్పై ఏళ్ళ క్రితం వారానికి అయిదు వందల ఉత్తరాలు అందుకునే మహదావకాశం నాకు లభించింది.

మా ఇంట్లో అందరికంటే వయసులో చిన్నదాన్ని అవటం, ఇదే పరిస్థితి మద్రాసు వచ్చాక కూడా ఉండటంచేత చందూర్ గారి పేరనా, మా అక్క పేరునా రోజూ ఉత్తరాలు వచ్చేవి. నాకు అడపా తడపా రేడియో వారు, ఆ రోజుల్లో ఉండే ఒకటి రెండు పత్రికలనుంచి తప్ప ఉత్తరాలు ఉండేవి కావు. అటువంటి వ్యక్తికి ఆర్.ఎమ్.ఎస్.లో పని చేసే తెలుగు తెలియని వ్యక్తులు ఈ పేరుకి ఇన్ని ఉత్తరాలు ఎందుకొస్తున్నాయి అనుకుంటూ ఇంగ్లీషులో శ్రద్ధగా నాకు అందేటట్లు రాయడం – దానిని ఏమంటాము? అవకాశమా? పరిస్థితులా? ఒక కొత్త ప్రయోగం పట్ల పాఠకులకి గల అభిమానమా? ఇన్ని ప్రశ్నలు వస్తూ ఉంటాయి ముప్పైరెండు ఏళ్ళుగా సాగుతూ ఉన్న ప్రమదావనాన్ని తల్చుకుంటే.

ప్రతిభ కంటే కూడా గొప్పది అవకాశం. ఆ అవకాశం తలుపు తట్టినప్పుడు దానిని అందుకోగల, ఉపయోగించుకోగల స్ఫూర్తి, నిలబెట్టుకోగల ఓర్పు ఈ రెండూ వుండాలి మనిషికి. ఆంధ్ర దేశంలోని లక్షలాది స్త్రీలు – సోదర సోదరీ మణులు ముప్పై రెండేళ్ళుగా ఏదో ఒక విషయంపై నన్ను ప్రశ్నించి సలహా అడుగుతున్నారూ అంటే దానికి నా ప్రతిభ కంటే ఆ రోజుల్లో నాకు లభించిన అవకాశం గొప్పది, ఉన్నతమైనది అని ఒప్పుకోవాలి.

మనకి స్వాతంత్ర్యం వచ్చేదాకా కుటుంబ సభ్యులందరూ చదవగలిగే ఫామిలీ మాగ్జయిన్సు అన్నవి ప్రత్యేకంగా లేవు. ఎంతకీ స్వాతంత్ర్యలక్ష్యంగల పత్రికలూ, పరాయి పాలనని దుయ్యబట్టే పత్రికలూ వుండేవి. స్వాతంత్ర్యం వచ్చి కాస్త స్థిమితపడి పత్రికా ప్రపంచంలో కొత్త ప్రయోగాలు చేస్తున్న రోజుల్లో ఇంటిల్లిపాదీ చదివే పత్రికలు రావడం. అందులోనూ అప్పటిదాకా స్త్రీలకి అన్ని ప్రత్యేక శీర్షికలులేని కాలంలో మొదటిసారి స్త్రీలకి పనికి వచ్చే విషయాలతో స్త్రీల సమస్యల గురించిన శీర్షిక నిర్వహించగల అవకాశం నాకు దొరికింది. అప్పుడు ప్రారంభమయింది. జనాభాలో సగానికి పైగా గల స్త్రీలు మనసు విప్పి తమతమ కష్టసుఖాలు చెప్పుకోగల, అభిప్రాయాలు రాయగల ఒక కొత్త వేదిక. కొత్త నేలమీద భూసారం ఎక్కువగా వుండి పంట ఏపుగా పెరుగుతుంది. ఇంచుమించు 'ప్రమదావనం' కూడా అంతే! అప్పటిదాకా అవకాశం లేని వేలాదిస్త్రీలు తమ మనసులోని మాట చెప్పుకోగల సస్యశ్యామలమైన పంట బంపర్ క్రాప్‌లా వచ్చింది. రచయితలకీ – రచయిత్రులకీ ఒక కూడలి స్థానం అయింది.

'ప్రమదావనా'నికి ఉత్తరాలు, చిన్న వ్యాసాలు రాసిన ఎందరో ఇప్పుడు ప్రముఖ రచయితల జాబితాలో వున్నారు. ఇది ఎలా జరిగింది? ఎందుకిలా ఉత్తరాలు వచ్చాయి? ఆ తరువాత రంగంలోకి దిగినవారికి ఎందుకింత పాపులారిటీ రాలేదు అంటే దానికి రెండు, మూడు కారణాలు కనిపిస్తాయి. ఏ కొత్త పని అయినా ప్రప్రథమంగా మొదలు పెట్టిన వారికి ఆ నూతనత్వం వల్ల ప్రథమ తాంబూలమూ, పాఠకుల హృదయంలో ప్రత్యేక స్థానమూ లభిస్తాయి. రెండో కారణం: నేను స్త్రీని అవడం చేత చాలా మంది స్త్రీలు తమ అన్న చెల్లెళ్ళకి, ఆఖరికి తల్లికీ, భర్తకీ కూడా చెప్పుకోలేని మానసిక బాధలు, సమస్యలు నాకు రాస్తూ ఉంటారు. నాకు రాయడం చేత అది రెండో కంటి వారికి తెలియదన్న భరోసా. మూడు: తాత్కాలికమైన మనో భారంతో భర్త మీద గాని, ఇంట్లో సమస్యలు గాని బయట వారికి చెపితే వారు ముందు ముందు దెప్పి పొడిచి, కించ బరుస్తారేమో నన్న భయం. నా విషయంలో ఈ భయం వుండదు. నాలుగు: కొన్ని వందల మైళ్ళ దూరాన వుండి తమ సమస్యతో ఎటువంటి సంబంధమూ లేని వ్యక్తికి మనోవేదన వెళ్ళబోసుకుంటే కొంత భారం తీరి, మనసు తేలికవుతుంది. కొంపలు అంటుకుపోయి సంసారాలు కూలిపోయే రహస్యాలు కూడా కొందరు తాత్కాలిక ఆవేశంలో రాసి, ఆ పైన మేము రాసినవి మర్చిపోండి అని మళ్ళీ రాసేవారూ వున్నారు. ఇవన్నీ స్త్రీల స్వభావ లక్షణాలు. నేను స్త్రీని కాబట్టి ఆ సహజమైన ఉద్రేకాలని అర్థం చేసుకోగలను.

'ప్రమదావనా'నికి రాసే అందరూ నన్ను మెచ్చుకుంటూ కష్టాలు చెప్పుకునే వారు కాదు. తీవ్రంగా విమర్శించి ఎక్కడయినా చిన్న పొరపాటు చేస్తే – దాన్ని పట్టుకు తిరుగు టపాలో రాసే వారు వున్నారు.

మూడు దశాబ్దాల పాటు ఒక శీర్షిక నిర్వహిస్తున్నప్పుడు కాలంతో పాటు పాఠకుల అభిరుచి, అభిప్రాయాలూ మారటం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. మొదటి పది ఏళ్ళూ నా పాఠకులు – వంటలూ, కుట్లూ, ముగ్గులూ వీటితో తృప్తి పడ్డారు. ఆ తరువాత మేము రాస్తాం అంటూ తమలోని రచనాత్మక తపనకి అంకురార్పణ చేశారు రెండో దశలో. మూడో దశలో ఇరుగు పొరుగు కబుర్లు కాదు. మాకు ఖచ్చితమైన ఇన్‌ఫర్‌మేషన్ కావాలి అంటూ తమ ఉత్తరాల్లో నన్ను నేను 'ఇంప్రూవ్' చేసుకునే స్థితికి తీసుకొచ్చారు. ముప్పై ఏళ్ళుగా పాఠకులతో పాటు నేనూ పరుగు పందెంలో పాల్గొంటున్నాననే ఒప్పుకోవాలి. విషయ పరిజ్ఞానంలో పాఠకుల కంటే ముందుండాలి అని నేనూ, 'మీకు ఎంత తెలుసో – కనుక్కుంటాం' అంటూ పాఠకులూ తమ ఉత్తరాల్లో నన్ను అదరకొడ్తూంటారు. నిజం చెప్పాలంటే తెలుగు పాఠకుల వల్ల నేను చాలా ఎదిగాను. ఎప్పటికప్పుడు 'లేటెస్ట్ ఇన్‌ఫర్‌మేషన్' సేకరించాలన్న తపన – ఆదుర్దా ఈ రెండు నా జీవిత గమ్యాలుగా రూపుదిద్దుకుంటున్నాయి.

తల్లికి ప్రథమ సంతానంపై కాస్త ఎక్కువ మక్కువ ఉంటుందట. అది నా

పట్ల కూడా నిజమే. మొదటి పదేళ్ళలో నాకు ఉత్తరాలు రాసిన గృహిణులు – `మా అమ్మాయి పెళ్ళి, నాకు మనుమడు పుట్టాడు, మా అబ్బాయి మీ సలహాతో యమ్.టెక్. అయ్యాడు` అని తమ కుటుంబ సభ్యులలో ఒక దానిగా ఎంచి శుభ లేఖలు, సంతోష వార్తలు రాసినప్పుడు ఆ పాఠకులు నా అతి సన్నిహితులు, చిర కాల మిత్రులు అన్న భావం కలుగుతూ వుంటుంది.

నేను రాసిన ప్రతి వంటనీ, ప్రతి కుట్టునీ, ప్రతి విషయాన్నీ దుయ్యబట్టి `మీరు ఇంతకంటే మంచి విషయాలు విజ్ఞాన దాయకమైనవి రాయాలి` అంటూ సూటిగా పదునయిన ఈటెల వంటి మాటల్తో మోచర్ల కౌస్తుభామణి అని ఒకరు రాస్తూ వుండే వారు. మిగతా ఉత్తరాల కంటే కౌస్తుభామణి ఉత్తరాలు చాలా జాగ్రత్తగా చదివేదాన్ని. `మీకు సిగ్గు లేదా? మీరెప్పుడు బాగు పడుతారు?` అని చివాట్లు వేస్తూ అదే ఉత్తరంలో ఓ మంచి నవల పరిచయం చేసినందుకు ప్రశంసించే వారు. ఉత్తరాలు కొన్నాళ్ళకి ఆగిపోగా – `ఎందుకు రావడం లేదా?` అనుకుంటున్నప్పుడు ఆ కౌస్తుభామణి మరణవార్త, భర్త సీతారామయ్య గారు రాసినప్పుడు చాలా బాధ పడ్డాను.

`మీరు మాకు ఆప్తులు. మా కుటుంబంలోని వంటివారని రాస్తున్నాను. మిమ్మల్ని ఎంత ఘాటుగా విమర్శించేదో మీరంటే అంత ఇష్టం. అందుకే ఈ దుఃఖ వార్త తెలియ బరుస్తున్నాను` అని. ఆయన రాసినప్పుడు ఎక్కడో వందల మైళ్ళ దూరంలో వున్న బరంపురంలో రీడర్‌కీ నాకూ ఏమిటీ అనుబంధం అనిపించింది. వైవిధ్యంలో సన్నిహితత్వం. దీనినే వేవ్‌లెంత్ అంటారు కాబోలు! ఆ తరువాత సీతారామయ్య గారు మమ్మల్ని మద్రాసులో కలుసుకుని మూడు గంటల సేపు గడిపారు, కౌస్తుభామణి కబుర్లతో.


ఈనాడు అమెరికాలో పటిష్ఠవంతమైన తెలుగు అసోసియేషన్ వుంది. వారు ప్రపంచ తెలుగు సభలు జరిపారు. అక్కడ నుంచి తెలుగు పత్రికలు, మంచి తెలుగు కథానికలు, నవలలు రాసే రచయితలు వస్తూన్నారంటే అందులో ప్రమదావనం పాత్ర కూడా కొంత వుందని కించిత్ గర్వం నాకు కలుగుతూ వుంటుంది.

ముప్ఫై ఏళ్ళ క్రితం – ఇండియా నుంచి, భారత దేశపు ఎల్లలు దాటే తెలుగు కుటుంబం ఉంది అంటే వీసా, పాస్‌పోర్టు గొడవల కంటే నేను ముందుగా వారిని పట్టుకునే దాన్ని. `అక్కడికెళ్ళాక మీ అనుభవాలు రాయండి ఏదో ఒకటి. ఎట్లా వస్తే అట్లా. మీ అమ్మ గార్కి, అక్క – చెల్లెళ్ళకి రాయరా? అలా రాయండి` అని పీకి పీకి ఉత్తరాలు రాబట్టేదాన్ని. సుసర్ల కామాక్షిరావు, మాటూరి సుమతీరావు, పెమ్మరాజు సువర్ణరాణి, ఆదిలక్ష్మి, కమలాదేశికన్, రాధా సుబ్రమణ్యం ఇలా ఎందరో ఇటు జపాన్ నుంచి – అటు కెనడా దాకా పంచఖండాల నుంచి మన తెలుగు వాళ్ళు ఎక్కడికెళ్ళినా ప్రమదావనానికి అక్కడి విశేషాలు రాయడం, వాటిని పాఠకులు కుతూహలంతో చదవడం అలవాటయిపోయింది. ఫారెన్ వెళుతున్నారంటే `ప్రమదావనంలో ఉత్తరాలు వస్తాయి కాబోలు` అని వేళాకోళం చేసిన వారే వాటన్నిటిని కలిపి ఒక పుస్తకంగా ప్రచురిస్తే బాగుంటుంది అని సలహా ఇచ్చారు. ఫారెన్ నుంచి సోదరీమణులు రాసే ఉత్తరాలు స్త్రీల శీర్షికకు ఒక ప్రత్యేక ఆకర్షణ అయింది. మరో ముఖ్య విషయం: ఈ విధంగా బయట దేశాలకి వెళ్ళినప్పుడు మొగవారు తమ దైనందిన అనుభవాలు గాని, కొత్త విశేషాలు గాని అంతగా రాయలేదు. ఇప్పుడిప్పుడు వారూ రాస్తున్నారనుకోండి.

ఏ వృత్తి, ఏ వ్యాపకమూ పూల బాట కాదు. ఈ పత్రికా ప్రపంచంలో కూడా అసూయలూ, ఈర్ష్యా ద్వేషాలూ, నిరంతరమైన పోటీ, శ్రమ అన్నీ ఉంటాయి. కాని మామూలు ఇతర రచనలకి వెనువెంటనే అభిప్రాయ ప్రకటన అంటే ఫీడ్‌బాక్ వీలవదు. ఈ ప్రమదావనం శీర్షికకు ఇంచుమించు నాలుగో సంచిక నుంచి `ఫీడ్‌బాక్`, – పాఠకుల నుంచి ఉత్తరాలు రావడం – అనే అపూర్వ విషయం జరిగింది. అందుచేత పాఠకుల నాడి, అభిరుచి, వాళ్ళ కష్టసుఖాలు, కన్నీళ్ళు, చిరునవ్వులు, జయాపజయాలు ఇవన్నీ నా జీవితంలో ఒక భాగం అయిపోయాయి. `మా ఆవిడ నిద్ర మాత్రలు మింగింది. ఎంత ప్రయత్నించినా దక్కించుకోలేక పోయాను. మీకు తరచు ఉత్తరాలు రాస్తూండేది. తను ఈ పని ఎందుకు చేసింది? నేను ఎక్కడ పొరబడ్డాను?` అని ఆవేదనతో ఉత్తరం రాసే ఆ భర్తకి ఏం జవాబు చెప్పాలి? అసలు కారణం నాకు తెలిసికూడా నాతో పాటు కాల గర్భంలో కలిసి పోవాలి తప్ప. అటువంటి బరువైన సన్నివేశాలెన్నో! ప్రేమలో బడ్డ యువకునికి `ముందు చదువు – ఆ పైన ప్రేమ!` అంటూ ఆ భంగపడిన యువకునికి నా సహజ ధోరణిలో చదువుకోమని సలహా ఇస్తే, ఆరేళ్ళ అనంతరం `ఐ.ఎ.యస్. అయ్యాను మీ ప్రోత్సాహం వల్లనే` అని ఆకాశం నుంచి ఊడిపడుతుంది ఒక శుభవార్త. ఇవి జీవితానికి తృప్తిని పరిపూర్ణతనీ ఇస్తాయి.

మా స్నేహితుడొకాయనకి స్టాటిస్టిక్స్ పిచ్చి వుంది. ఆయన నా కొచ్చిన ఉత్తరాలన్నీ కలిపి ఉత్తరానికి రూపాయి చొప్పున వాటి పోస్టేజికై పాఠకులు ఖర్చు పెట్టిన డబ్బు సుమారు ఒక పది లక్షల రూపాయలు ఉండి ఉంటుంది అని తేల్చారు. అంటే . వినడానికి బావుంది కాని నేను నమ్మను. ప్రతిదీ డబ్బులోకి మార్చి చూడటం కూడా న్యాయం కాదు. నాకు లభించినంతమంది పాఠకులు నా కొచ్చినన్ని ఉత్తరాలు, ఆదరణ, స్నేహమాధుర్యం ఎవరికీ లభించలేదు. ఆంధ్ర పాఠకలోకంలోని స్త్రీలంతా సర్వదా నా పక్షం. పురుషులు కొందరు గొణుక్కుంటూ ఆమోదిస్తారు నా అభిప్రాయాలు.

కుటుంబంలోని మూడు తరాల వ్యక్తుల ఉత్తరాలు అందుకుంటున్న అపూర్వమైన అపురూపమైన శీర్షిక `ప్రమదావనం`. ఈ శీర్షిక ద్వారా పాఠకులు ఎంత నేర్చుకొన్నారో చెప్పలేను గాని నేను మటుకు లక్షలాది పాఠకుల స్నేహమాధురి వల్ల ప్రభావితమయాను, అవుతున్నాను. అది తిరుగులేని సత్యం.



*శ్రీమతి మాలతి చందూర్ నలభైమూడు ఏళ్ళుగా ఆంధ్రప్రభ వార పత్రికలో ప్రమదావనం, జవాబులు శీర్షికలు నిర్వహిస్తూ తెలుగు పాఠకులకు చిరపరిచితులయ్యారు. అనేక కథలు, నవలలు, పాత కెరటాలు నవలా పరిచయాలు వ్రాసిన శ్రీమతి మాలతీ చందూర్ 1992 కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు అందుకొన్నారు. ఈ దశమ తానా మహాసభల ప్రత్యేక ఆహ్వానితుల్లో ఒకరు. ఈ వ్యాసం 1985 తానా సమావేశం ప్రత్యేక సంచికనుంచి పునర్ముద్రితం.*